టంగుటూరి ప్రకాశం పంతులు 69వ వర్ధంతి

విశ్వంభర, హైదరాబాద్ : టంగుటూరి ప్రకాశం పంతులు 69 వ వర్ధంతి సందర్భంగా హైదరాబాదులో జరిగిన కార్యక్రమానికి అతిథులుగా మాజీఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు , తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ , వీ. హనుమంతరావు పాల్గొని ఘనంగా పుష్పాంజలిఅర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రకాశం పంతులు ముందు తరానికి ఆదర్శమని ఆయన పట్టుదల ధీరత్వం తెలుగు ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని అన్నారు. స్పీకర్ ప్రసాద్ మాట్లాడుతూ నేటి తరానికి ప్రకాశం పంతులు ఎంతో ఆదర్శమని అలాంటి మహానీయులు ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పని చేయాలని తెలిపారు. హనుమంతరావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు ధైర్యానికి సేవా తత్వగుణం, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనమని ఆయన గొప్పతనాన్ని కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ రుద్రరాజు పద్మరాజు , సి డబ్ల్యూ ఎస్ సభ్యులు గిడుగు రుద్రరాజు , బ్రాహ్మణ పరిషద్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం, మాజీ సలహా దారులు వేణుగోపాల చారీ, వక్కలంక శ్రీనివాస రావు , దైవజ్ఞ శర్మ ,ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ సభ్యులు చైర్మన్ పి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలూ చిప్స్, వాటర్ బాటిళ్లలో రూ.3కోట్ల విలువైన గంజాయి పట్టివేత

విశ్వంభర, హైదరాబాద్ : శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా హైడ్రోఫోనిక్ గంజాయిని పట్టుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల నుంచి 8.705 కిలోల గంజాయిని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లగేజీలో అనుమానాస్పదంగా ఉన్న 24 ప్యాకెట్లను వారు గుర్తించారు. ఆలూ చిప్స్, వాటర్ బాటిల్స్, ఇతర డబ్బాల్లో తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ గంజాయి విలువ రూ.3.05 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

విచారణకు సహకరించాలనే

నా కుమారుడిని అప్పగించా: బండి సంజయ్

విశ్వంభర, హైదరాబాద్ : బీజేపీలో ప్రతిఒక్కరూ సుశిక్షితులైన కార్యకర్తలే నని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కమిట్‌మెంట్‌తో పనిచేసే పార్టీ కార్యకర్తను చివరి కోరిక ఏంటని అడిగితే.. చనిపోయిన తర్వాత భాజపా జెండా కప్పాలని కోరుకుంటారని చెప్పారు. తాను ఎలాంటి వాడినో కార్యకర్తలకు తెలుసన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో సంజయ్ మాట్లాడారు.బర్తరఫ్ చేయాలని ఇతర పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా సంజయ్ స్పందిస్తూ.. ‘‘కేసీఆర్ పార్టీకి లోక్‌సభలో ఒక్క ఎంపీ లేరు. ఫామ్‌హౌస్‌లో కూర్చుని ఏదైనా చెబుతారు. ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కూల్చింది.. ఆ కుటుంబ పాలనను అంతం చేసింది మేమే. అందుకే మాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. కేటీఆర్ ఫేక్ సోషల్ మీడియా ఫ్యాక్టరీ నడుపుతున్నారు. కన్నకొడుకును పోలీసులకు స్వయంగా అప్పగించిన సందర్భం ఏదైనా ఉందా? విచారణకు సహకరించాలనే నా కుమారుడిని అప్పగించా.’’ అని బండి సంజయ్ అన్నారు.

సీఎం, మంత్రుల పేరుతో వసూళ్లు..

నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

విశ్వంభర, మేడ్చల్ : సీఎం, మంత్రుల పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పేట్ బషీరాబాద్ ఏసీపీ శంకర్ రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లా శివ్వంపేటకు చెందిన సంతోష్‌గుప్తా మేడ్చల్ పరిధి మునీరాబాద్ లో ఆర్.ఆర్ రియల్ ఎస్టేట్ సంస్థ యజమానికి ఫోన్ చేసి.. 5 విల్లాలు అమ్మి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. దీంతో బాధితుడు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. నిందితుడిపై నిఘా పెట్టి అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. కాంగ్రెస్ నాయకుడిని అంటూ సంతోష్‌గుప్తా చాలా మందికి భూ వివాదాల్లో సెటిల్‌మెంట్లు చేసినట్లు ఆరోపణలున్నాయి. కుత్బుల్లాపూర్, కొంపల్లి, సుచిత్ర మేడ్చల్‌లో బాధితుల నుంచి డబ్బు వసూళ్లకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

నేరాల స్వరూపం మారుతుంది

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : విజిలెన్స్ విభాగంలో సాంకేతికతను పెంచాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారిపై విజిలెన్స్ దృష్టి పెట్టాలన్నారు. ఆ విభాగానికి మరిన్ని అధికారాలు ఇచ్చే అంశంపైన అధ్యయనం చేయాలని పోలీస్‌శాఖ ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో పోలీస్ సీనియర్ అధికారులతో రే వంత్ రెడ్డి సమావేశం అయ్యారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అగ్నిమాపక, పురపాలక, హైడ్రా కలిసి జూన్ 15లోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. మ్యాన్ హోల్స్ నిర్వహణపై పోలీస్, ట్రాఫిక్, హైడ్రా సమన్వయంగా పనిచేయాలన్నారు. నగరంలో అడ్డగోలుగా ఫ్లెక్సీలు కడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలను నియంత్రించాల్సిందేనన్నారు. పోలీసులు, జీహెచ్ఎంసీ కఠినంగా ఉండాలన్నారు. రాత్రి పూట పెట్రోలింగ్ పెంచాలని సూచించారు. డ్రగ్స్ బాధితుల కోసం ప్రత్యేక డిఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐ నుంచి నాన్ క్యాడర్ ఎస్పీ వరకు పదోన్నతి తర్వాత రెండేళ్లు ఇతర విభాగాల్లో పనిచేయాలని స్పష్టం చేశారు. సైబర్ క్రైమ్ నియంత్రణపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఫోరెన్సిక్ సెంటర్లు, డేటా సెంటర్లను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్న ఆయన స్కిల్ వర్సిటీలో సైబర్ క్రైమ్‌పై పోలీస్ విభాగం కోసం ప్రత్యేక కోర్సు ఏర్పాటు చేయాలని అధికారులను కీలక సూచనలు చేశారు. పోలీస్ శాఖలో బాధ్యత పెరగాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వ్యవస్థలో అందరూ భాగస్వాములేనని పరిధి దాటి వెళ్లేందుకు వీళ్లేదన్నారు.

హెడ్‌క్వాటర్స్ విడిచిపెట్టి వెళ్లాలంటే తప్పని సరిగా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. నేర సమీక్ష సమావేశాలు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎస్పీలు నిరంతరం జిల్లాలో పర్యటించాలని సూచించారు. రౌడీషీటర్లపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. విభాగంలో అన్ని వాహనాలు ఈవీకి మారాలని ఆదేశించారు. శాంతి భద్రతల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే సహించనని హెచ్చరించారు.పెట్రోలింగ్‌ను బలోపేతం చేయాలన్నారు. విలేజ్ పోలిసింగ్‌ను బలోపేతం చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. డ్రోన్ పోలీసింగ్‌ను పెంచాలన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. నేరాల స్వరూపం మారుతుంది.. దానికి అనుగుణంగా పోలీసింగ్ మారాలని రేవంత్ రెడ్డి తెలిపారు. పోలీస్‌శాఖలో అవినీతి ని సహించన్న ఆయన అధికారుల మధ్య సమన్వయం పెరగాలన్నారు. అన్ని పీఎస్‌ల్లో ఫిర్యాదుల కోసం క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేయాలని సూచించారు.

తెలుగువారి తెగువకు

నిలువెత్తు నిదర్శనం ప్రకాశం పంతులు

వెంకయ్యనాయుడు

విశ్వంభర, నారాయణగూడ : తెలుగు ప్రజల తెగువకు, ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. ఆయన జీవితం ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిదాయకమైందని అన్నారు. బుధవారం హైదరాబాద్ అసెంబ్లీ కూడలిలో ప్రకాశం పంతులు 69వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్రప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావులతో కలిసి ఆంధ్రకేసరి విగ్రహం వద్ద వెంకయ్యనాయుడు నివాళులర్పించారు.ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. సమాజానికి, దేశానికి సేవ చేసిన మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ప్రస్తుత తరానికే కాదూ..భావితరాలకు సైతం ఆంధ్రకేసరి గొప్పదనం, పోరాటపటిమతో పాటు ఆయన జీవితాన్ని పరిచయం చేయాలన్నారు. అపారమైన దేశభక్తి, మొక్కవోని ధైర్యం ప్రకాశం పంతులుకు ఆభరణాలని పేర్కొన్నారు. అప్పటి మద్రాసుకు వచ్చిన సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో బ్రిటిష్ తుపాకులకు ఎదురొడ్డి నిలిచిన ధీశాలి అని కొనియాడారు. నేటి యువత ప్రస్తుత పాశ్చాత్య పోకడలను అనుకరిస్తూ.. మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని, ఇతరత్రా విషయాల్లోనూ దారితప్పి నడుచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రకాశం పంతులు వంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రకాశం పంతులు ధైర్యానికి, సేవాగుణానికి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, మాజీ ప్రభుత్వ విప్ రుద్రరాజు పద్మరాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞశర్మ, ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ చైర్మన్ మోహన్‌రావు, వైస్‌చైర్మన్ ఎంసీ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి టంగుటూరి శ్రీరామ్, సెక్రటరీ నిరంజన్ దేశాయ్, కోశాధికారి హనుమంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాధాకృష్ణ, సంయుక్త కార్యదర్శి టి.రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రంగనాథ్, రామ్మోహన్‌రెడ్డి, టీవీ రావు, కలకూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో పెట్టుబడులకు

ఎఫ్ఆర్బీఎం మినహాయింపు ఇవ్వండి: కేంద్రాన్ని కోరిన భట్టి

విశ్వంభర, ఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యారంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సాయం కోరారు. సాస్కీ పథకం కింద రూ.5వేల కోట్ల ప్రత్యేక సాయం, విద్యారంగంలో పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు ఇవ్వాలని కేంద్రమంత్రిని భట్టి విక్రమార్క కోరారు. 202526 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమన్నారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. 20142023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థల (ఎస్‌పీవీ) ద్వారా తీసుకున్న అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందంటూ కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని నిర్మలా సీతారామన్ దృష్టికి భట్టి విక్రమార్క తీసుకెళ్లారు. ‘యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్’ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించిందని, దీనిలో రూ.21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల క్యాంపస్‌ల నిర్మాణం, మరో రూ.9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు.

అత్తామామలను చంపిన అల్లుడికి ఉరిశిక్ష

విశ్వంభర, వరంగల్ : అత్తామామలను నరికి చంపిన అల్లుడికి ఉరిశిక్ష విధిస్తూ బుధవారం వరంగల్ మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి మైత్రేయి తీర్పు వెలువరించారు. వివరాలివి.. మేకల నాగరాజు అలియాస్ బన్నీ (25) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారు చింతల్‌తండాకు చెందిన దీపికను 2023 నవంబరులో ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంతకాలానికి వారిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో పుట్టింటికి వెళ్లిపోయిన దీపిక తిరిగిరాలేదు.దీంతో అక్కసు పెంచుకున్న నాగరాజు 2024 జులై 10న పదహారుచింతల్‌తండాలో రాత్రివేళ నిద్రిస్తున్న అత్తామామలు సుగుణ, శ్రీనులను దారుణంగా కత్తితో నరికి హతమార్చాడు. అడ్డుగా వచ్చిన దీపిక, బామ్మర్దిలపై సైతం కత్తితో దాడి చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో నేరారోపణ పత్రాన్ని దాఖలు చేశారు. నాగరాజుకు బెయిల్ ఇచ్చేందుకు కింది కోర్టు, హైకోర్టులు నిరాకరించడంతో నాగరాజు అప్పటి నుంచి న్యాయ నిర్బంధంలోనే ఉన్నాడు. గతేడాది ఆగస్టు 7 నుంచి ఈ ఏడాది మార్చి 2 వరకు కోర్టులో విచారణ సాగింది. నేరం రుజువు కావడంతో నాగరాజు మరణించే వరకు ఉరి తీయాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

అనారోగ్యంతో తల్లి మృతి.. తట్టుకోలేక తనయుడి ఆత్మహత్య

విశ్వంభర, బోధన్ : అనారోగ్యంతో తల్లి మరణించింది. ఆమె మృతిని తట్టుకోలేక తనయుడు ఉరివేసుకుని తనువు చాలించాడు. ఈ ఇద్దరి మృతి ఓ అంధురాలిని అనాథగా మార్చింది. ఈ విషాద ఘటన నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం ఖండ్‌గాం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన పద్మినీబాయి(70) భర్త కొన్నేళ్ల క్రితం మరణించాడు.అప్పటి నుంచి కొడుకు సనీల్‌దేవ్(30), కూతురు స్వప్న(25)తో కలిసి ఉంటోంది. స్వప్న అంధురాలు. మంగళవారం రాత్రి కుటుంబసభ్యులు భోజనం చేసి నిద్రించారు. ఆ నిద్రలోనే పద్మినీబాయి కన్నుమూసింది. అర్ధరాత్రి నిద్రలేచిన సనీల్ తల్లిని విగతజీవిగా చూసి తట్టుకోలేకపోయాడు. ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలియని స్వప్న రోజులాగానే అమ్మ, అన్నను పిలవగా వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. కంగారుపడిన ఆమె గట్టిగా రోదించడడంతో చుట్టుపక్కల ఉన్న వారు వచ్చి చూసేసరికి తల్లీకొడుకులు విగతజీవులుగా కనిపించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. శవ పంచనామా నిర్వహించి సనీల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం గ్రామంలో ఇద్దరి అంత్యక్రియలు నిర్వహించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు గ్రామీణ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు.

మైనర్ బాలికను పెళ్లి చేసుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

విశ్వంభర, హుజూర్‌నగర్ : మైనర్ బాలికను పెళ్లి చేసుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నాయని అనిల్ కుమార్.. ఈ నెల 9న అనంతగిరి మండలానికి చెందిన బాలికను పెళ్లి చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు కానిస్టేబుల్ అనిల్‌పై హుజూర్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- అధ్యక్షులు పెండ్యాల నగేష్

విశ్వంభర, సరూర్ నగర్ : మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్‌లో గల కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆర్కే పురం డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అధికారులను కోరారు. శాసన సభ్యురాలు సబితా ఇంద్రా రెడ్డి నిధుల ద్వారా మంజూరైన టెలిఫోన్ కాలనీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలతో పరిశీలించడం జరిగిందని ఆయన తెలిపారు. అనంతరం నగేష్ మాట్లాడుతూ పనులలో జాప్యం జరగకుండా పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ విజయ్ కుమార్,కాలనీ అధ్యక్షులు సంజీవరెడ్డి,నాయకులు సాజిద్, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రామ నర్సింహా గౌడ్, కొండ్ర శ్రీనివాస్, రామాచారి, స్వప్న రెడ్డి, శ్యామ్ గుప్తా, వెంకటేష్ గౌడ్, జాహీద్, కపిల్, సంతోష్, శివ నాయక్, కాలనీవాసులు మధు,వాసవి, లక్ష్మి పాల్గొన్నారు.

మైనింగ్ పనులను తక్షణమే నిలిపివేయాలి

ఉపాధి హామీ కూలీల డిమాండ్

విశ్వంభర, జనగాం : దేవరుప్పుల మండలం ఉమ్మడి కడవెండి గ్రామ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి గాంచిన, చుట్టుపక్కల గ్రామాల మండలాల ప్రజల ఆరాధ్య దైవం గా కొలువైన ఆధ్యాత్మిక మైన శ్రీ వాన కొండయ్య లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం తరతరాలుగా స్థానిక ప్రజల నమ్మకానికి, సంస్కృతికి ఈ గుట్ట ఒక నిలువుటద్దం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం ఈ పవిత్రమైన గుట్టపై జరుగుతున్న మైనింగ్ (క్వారీ) పనులు స్థానిక ప్రజలను, భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.ఈ నేపథ్యంలో జిల్లా నాయకులు పల్లా సుందర్ రామిరెడ్డి ఆధ్వర్యంలో ,గ్రామంలోని ఉపాధి హామీ పనుల దగ్గర ఉన్న వందలాది మంది కూలీలను కలిసి, ఈ మైనింగ్ అంశంపై వారి అభిప్రాయాలను సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా కూలీలు తమ ఆవేదనను, అభ్యంతరాలను వ్యక్తం చేశారు. వాన కొండయ్య లక్ష్మీనరసింహస్వామి మా ఇలవేల్పు. స్వామివారు కొలువైన గుట్టను మైనింగ్ పేరుతో తవ్వేస్తుంటే మా మనోభావాలు దెబ్బతింటున్నాయి. లాభాల కోసం దేవుడి గుట్టను సైతం ధ్వంసం చేయడం సరికాదు. మైనింగ్ నుండి వచ్చే దుమ్ము, ధూళి కారణంగా చుట్టుపక్కల ప్రాంత వాతావరణం కలుషితమైన. దీనివల్ల పక్కనే ఉన్న పొలాల్లో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. గుట్టపై మైనింగ్ కోసం జరిపే భారీ పేలుళ్ల శబ్దాలకు భవిష్యత్తులో గుట్టపై ఉన్న పురాతన ఆలయ నిర్మాణానికి కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మా వాన కొండయ్య గుట్ట కేవలం ఒక రాయి, రప్ప కాదు, అది మా ప్రాంత సంస్కృతి, నమ్మకం. మా ప్రాణాలైనా ఇస్తాం కానీ,దేవుడి గుట్టను మైనింగ్ మాఫియా పాలు కానివ్వం అని ఉపాధి హామీ కూలీలు , బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేష్ మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య,ఏల సోమ సుందర్ గ్రామ సర్పంచ్ భాషిపాక రాములు గ్రామ శాఖ అధ్యక్షుడు తాటిపల్లి మహేష్ ,బీఆర్ఎస్ పార్టీ గ్రామ మండల నాయకులు సుడిగాల హనుమంతు నక్క రమేష్ , సోమ నర్సయ్య,రాజు,మండల సీనీయర్ నాయకులు,యువజన నాయకులు, గ్రామ పెద్దలు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఈ మైనింగ్ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS ప్రజా విశ్వంభర "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108